సాక్షి నిజామాబాద్

సోమవారం । 11 । నవంబర్ । 2024



లెక్క పక్కానేనా!

ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసే చేప పిల్లల లెక్కలపై మత్స్యకారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

- 8లో ▸



వర్గీకరణపై తొందరపాటు..

ఎస్సీ వర్గీకరణపై తొందరపాటు నిర్ణయం సరికాదని సీఎంకు చెప్పినట్లు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
36.6 /15.6

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచుకురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

పాము కాదు పాపెర



డొంకేశ్వర్(ఆర్మూర్) : ఇక్కడ కనిపించేది పాము అనుకుంటే మీరు పొరబడ్డట్టే. అది మను పాపెరగా పిలుచుకునే అరుదైన చేప. డొంకేశ్వర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన భోజన్న అనే మత్స్యకారుడికి ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో ఆదివారం లభ్యమైంది. వలకు చిక్కిన దీనిని చూసిన మత్స్యకారుడు తొలుత పాము అనుకుని వలను అలాగే వదిలేద్దామని అనుకున్నాడు. సరిగ్గా చూసేసరికి అది ఆరు అడుగుల పాపెర కావడంతో ఆనందంతో ఊరిలోకి తీసుకొచ్చి అందరికీ చూపించాడు. మనిషి ఎత్తున్న పాపెర చేప దొరకడం తనకు ఇదే తొలిసారని మత్స్యకారుడు భోజన్న పేర్కొన్నారు.

సర్వే పక్కాగా కొనసాగాలి



బాల్కొండ : సమగ్ర కుటుంబ సర్వేను పక్కాగా చేపట్టాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. బాల్కొండ మండలం చిట్టాపూర్‌లో చేపడుతున్న సర్వేను ఆదివారం ఆయన పరిశీలించారు. మార్గదర్శకాల ప్రకారం వివరాలు సేకరించాలని సూచించారు. సర్వేకు ఎలాంటి అవాంతరాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతకు ముందు ఉన్నత పాఠశాలలో గల పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. అనంతరం బాల్కొండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులకు సకాలంలో డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్మూర్ ఆర్డీవో రాజు గౌడ్, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో విజయ్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

'ముషాయిరా'కు పునరుజ్జీవం పోయాలి



నిజామాబాద్ సిటీ : ముషాయిరా పురాతనమైన దీర్ఘ కవితా రూపమని, అంతరించే పోయే దశకు చేరిన దానికి పునరుజ్జీవం పోయాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కోరారు. ఆదివారం నగరంలోని ఎన్నార్సై కాలనీలో నిర్వహించిన ముషాయిరా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పురాతన రోజుల్లో పలు సమస్యల మీద అందరికీ అర్థమయ్యే భాషలో సాగే ప్రక్రియ ముషాయిరా అన్నారు. ఒకప్పుడు ముషాయిరా రచించిన పుస్తకాలకు ఆదరణ ఉండేదని గుర్తుచేశారు. అనంతరం ఆయన ఉర్దూ కవులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. నుడా చైర్మన్ కేశ వేణు, కార్పొరేటర్లు ఖుద్దూస్, ఆరూన్ ఖాన్, జావేద్ అక్రం పాల్గొన్నారు.

శివాలయంలో న్యాయమూర్తి పూజలు



నాగిరెడ్డిపేట: మండలంలోని తాండూర్ శివా రులో ఉన్న శ్రీత్రిలింగేశ్వరాలయంలో నిజామాబాద్ జిల్లా కోర్టు న్యాయమూర్తి సునీత కుంచాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసాన్ని పురస్కరించు కుని శివలింగానికి అభిషేకం చేశారు. పూజారి మల్లికార్జునప్ప న్యాయమూర్తికి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ దత్తు తదితరులు పాల్గొన్నారు.

రుద్రూర్‌లో ఒకరికి డెంగీ

రుద్రూర్: రుద్రూర్‌లో ఒక యువకుడికి డెంగి పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో ఆరోగ్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను కలిసి మాట్లాడారు. పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ కృష్ణవేణి ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి నిల్వ నీటిని పారబోయించారు. డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ జ్యోతి, అసిస్టెంట్ ప్రమీల ఉన్నారు.



నగరంలోని ఐటీఐ కళాశాలలో విన్యాసం చేస్తున్న స్వయం సేవకులు

విశ్వగురువు చేయడమే లక్ష్యం

- హిందూ సంఘటనం కోసం ఆర్‌ఎస్‌ఎస్ పనిచేస్తోంది
- హిందువులను విచ్ఛిన్నం చేసేందుకు పలు దేశాల కుట్రలు
- ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ సహ ప్రాంత ప్రచారక్ కల్పగురి ప్రభుకుమార్
- నగరంలో ఆకట్టుకున్న పథ సంచలన్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : భారత్‌ను విశ్వగురువు స్థానంలో నిలబెట్టడమే లక్ష్యంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) వందేళ్లుగా కృషి చేస్తోందని ఆ సంస్థ తెలంగాణ సహ ప్రాంత ప్రచారక్ కల్పగురి ప్రభుకుమార్ తెలిపారు. ఆదివారం ఇందూరు నగరంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మహా పథ సంచలన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కళాశాల విద్యార్థి శిబిర సార్వజనికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుకుమార్ మాట్లాడుతూ.. వెయ్యేళ్ల బానిసత్వానికి ముందున్న జగద్గురు స్థానానికి భారత్‌ను తీసుకెళ్లేందుకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తోందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ సంపూర్ణ హిందూ సంఘటనతోనే నేడు హిందుత్వం ప్రపంచవ్యాప్తమైందన్నారు. ప్రస్తుతం సంఘ్ గురించి ప్రపంచ వ్యాప్తంగా చర్చ నడుస్తోందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ హిందూ ధర్మ విద్య శిక్షణ విధానాన్ని మాత్రమే పాటిస్తోందన్నారు. 1925 విజయదశమి రోజున హెడ్గేవార్ ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించకముందు హిందుత్వ గురించి పలకాలంటేనే అడుగడుగునా ఆలోచించే పరిస్థితి ఉండేదన్నారు. సంఘ్ కారణంగా హిందూ సమాజ సంఘటన జరిగి నేడు మార్పు వచ్చిందన్నారు. సంఘ్ ప్రేరణతో హిందువులు కలిసి సాగుతున్నారన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ సహ ప్రాంత ప్రచారక్ ప్రభుకుమార్

మహా పథ సంచలన్‌లో ఎమ్మెల్యే ధన్‌పాల్

ఇందూరు మహా పథ సంచలన్‌లో నిజామాబా ద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాదాసు స్వామియాదవ్, ఏబీవీపీ విభాగ్ ప్రచారక్ నరేశ్, మంచాల ట్రస్ట్ చైర్మన్ జ్ఞానేందర్ గుప్తా పాల్గొన్నారు. నగరంలోని మూడు ప్రాంతాల నుంచి మొదలైన స్వయంసేవక్‌ల పథ సంచలన్ శివాజీ నగర్ చౌక్ వద్ద త్రివేణి సంగమం మాదిరిగా కలిసి ఐటీఐ కళాశాల మైదానానికి చేరుకుంది. స్వయంసేవక్‌ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

పూర్వీకుల గురించి తెలుసుకోవాలి

కుటుంబ వ్యవస్థను పటిష్ఠంగా ఉంచేందుకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తోందని ప్రభుకుమార్ అన్నారు. మన పూర్వీకుల గురించి చర్చ జరిగితేనే శివాజీ, వివేకానంద స్వామీజీ లాంటి వారు తయారవుతారన్నారు. వ్యక్తిగత జీవితం కన్నా దేశ క్షేమమే లక్ష్యంగా పనిచేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి గజవాడ హనుమంతరావు, ఇందూరు విభాగ్ సంఘచాలక్ నిమ్మల ప్రతాప్ రెడ్డి, శిబిరం ఇన్‌చార్జి గజానంద్, విభాగ్ ప్రచారక్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



నగరంలోని శివాజీ నగర్ చౌరస్తా వద్ద పథ సంచలన్‌లో పాల్గొన్న స్వయం సేవకులు

కులాల పేరుతో విభజించే కుట్ర

భారత్‌లో హిందువులను కులాల పేరుతో, సంస్కృతి పరంగా విభజించేందుకు కొన్ని దేశాలు కుట్రలు చేస్తున్నాయని ప్రభుకుమార్ ఆరోపించారు. లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్, జనాభా జిహాద్ పేరిట అడుగడుగునా హిందు మతంపై కొందరు దాడి చేస్తున్నారన్నారు. కొందరు కుటుంబాల బలహీనతలను ఆసరాగా చేసుకుని మతమార్పిడులు చేస్తున్నారని ఆరోపించారు. కొన్ని సంస్థలు ఎన్‌జీవోల పేరిట నాస్తికత్వాన్ని పెంచుతున్నాయని పేర్కొన్నారు. ప్రపంచస్థాయి మార్కెటింగ్ శక్తులు సైతం జనాభా, సంపద ఎక్కువ ఉన్న భారత్ ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాయన్నారు.



పథ సంచలన్‌లో బాల స్వయం సేవకులు



ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి

సాంకేతిక తప్పిదంతో జాబ్ ఇచ్చాం

ఇప్పుడు తొలగిస్తున్నాం

- డీఎస్సీ అభ్యర్థుల జీవితాలతో విద్యాశాఖ అధికారుల ఆటలు

నిజామాబాద్ అర్బన్ : ఎన్నో ఏళ్లుగా కలలు కన్న టీచర్ జాబ్ వచ్చిందని ఆమె సంబురపడ్డది. తెలుసినోళ్లందరితో తనకు ఉద్యోగం వచ్చిందని పంచుకుంది. బడిలో జాయిన్ అయి పాఠాలు కూడా చెప్పింది. తీరా ఇప్పుడు అధికారులు సాంకేతిక తప్పిదంతో వేరే వారికి రావాల్సిన ఉద్యోగం మీకు వచ్చిందని చెప్పారు. ఆమెను ఉద్యోగంలో నుంచి తొలగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. మాక్లూర్ మండలం అమ్రాద్‌కు చెందిన ఊట్నూర్ లావణ్యకు ఇటీవల డీఎస్సీలో ఎస్జీటీ ఉద్యోగం వచ్చినట్లు అధికారులు నియామక పత్రం అందించారు. ఆమెకు డీఎస్సీలో 257వ ర్యాంక్ వచ్చింది. ధర్పల్లి మండలంలోని దుబ్బాక పరిధిలోని వడ్డెర కాలనీ ప్రాథమిక పాఠశాలలో నియమించారు. దీంతో ఆమె అక్కడే ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటూ విధులకు హాజరయ్యారు. ఆమెను ఉద్యోగంలో నుంచి తొలగిస్తున్నట్లు అధికారులు ఈ నెల 9న ఉత్తర్వు అందించారు. ఇందులో సాంకేతిక కారణాలను ఎత్తి చూపుతూ ఉద్యోగాన్ని రద్దు చేశారు. బీసీ ఏ క్యాడర్‌లో ఆమెకంటే ముందు భార్గవి 125వ ర్యాంకు, కల్లూరు శ్రీనివాస్ 165 ర్యాంకు పొందారు. దీంతో వారిలో ముందు ఉన్న భార్గవికి రావాల్సిన జాబ్ సాంకేతిక తప్పిదంతో లావణ్యకు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఇన్ని రోజులు చేశాక ఉద్యోగం నుంచి తొలగించడంతో ఆమె ఆవేదన చెందుతోంది. కాగా గతంలోను అధికారులు పలువురికి సాంకేతిక కారణాల పేరు చెప్పి ఉద్యోగాలు ఇవ్వలేదు. తర్వాత మళ్లీ పిలిచి నియామక పత్రాలు అందజేశారు.



హైదరాబాద్‌లో లావణ్యకు నియామక పత్రం అందిస్తున్న అధికారులు (ఫైల్)

నదులు కలుషితం కాకుండా చూడాలి

- హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్/రెంజల్ : నదులు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. రెంజల్ మండలంలోని కందకుర్తి గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. త్రివేణి సంగమం (గోదావరి, మంజీర, హరిద్ర నదులు కలిసే చోటు) వద్ద గోదావరి హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతిని పూజిస్తే ధన్యత లభిస్తుందన్నారు. నదీ జలాలను సద్వినియోగం చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు మరిన్ని చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకులు కేశవ బలిరామ్ పంత్ హెడ్గేవార్ పూర్వీకుల ఇంటి స్థలంలో నిర్మిస్తున్న స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. హెడ్గేవార్ మూలాలు తెలంగాణవి కావడం మనందరికీ గర్వకారణమన్నారు. వందేళ్లలో అనేక సేవా కార్యక్రమాలను ఆర్‌ఎస్‌ఎస్ చేసిందన్నారు. తాను ప్రస్తుతం రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నప్పటికీ ఎప్పటికీ స్వయం సేవక్‌నేనని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ కారణంగానే ఈ స్థాయికి వచ్చినట్లు తెలిపారు.



కందకుర్తి త్రివేణి సంగమంలో గోదావరికి హారతి ఇస్తున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి

కందకుర్తి గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి కేంద్ర సాంస్కృతిక శాఖతో మాట్లాడుతానని దత్తాత్రేయ పేర్కొన్నారు. కందకుర్తిలో రూ.40 కోట్లతో శిక్షణ కేంద్రాల నిర్వహణ అభినందనీయమన్నారు. డాక్టర్ హెడ్గేవార్ వ్యక్తి నిర్మాణం కోసం పనిచేశారని వివరించారు. విద్య, ఉపాధి ద్వారానే నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. స్థానికులు ఆయన దృష్టికి పలు సమస్యలను తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పనులను పూర్తి చేయిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్గేవార్ మనవడు దిలీప్ శాస్త్రి హెడ్గేవార్ తదితరులు పాల్గొన్నారు.

రెండు వర్గాలుగా ఏఈవోలు!

- విభేదాలతో యూనియన్‌లో చీలికలు
- డిజిటల్ క్రాప్ సర్వేను వ్యతిరేకిస్తున్న వారంతా ఒకవైపు
- అనుకూలంగా ఉన్నవారు మరోవైపు

డొంకేశ్వర్(ఆర్మూర్) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి వ్యవసాయ శాఖతో చేయిస్తున్న డిజిటల్ క్రాప్ సర్వే ఎంత వరకు వచ్చిందో తెలియదు కానీ వ్యవసాయ విస్తీర్ణ అధికారుల మధ్య మాత్రం చిచ్చు రేపుతోంది. మొన్నటి వరకు సర్వేను వ్యతిరేకించిన వారిలో కొంతమంది ఇప్పుడు సర్వేకు అనుకూలంగా మారడంతో యూనియన్‌లో విభేదాలు ఏర్పడి చీలికలు వచ్చాయి. ఇది వరకు ప్రధాన పాత్ర పోషించిన టీఏఈవో యూనియన్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ తన పదవికి రాజీనామా చేశారు. సర్వేను వ్యతిరేకిస్తున్న వారంతా కలిసి వ్యవసాయ విస్తీర్ణ అధికారుల ఐక్య వేదిక పేరుతో కొత్త సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. సర్వేకు అనుకూలంగా ఉన్న వారు పాత యూనియన్‌లోనే ఉన్నారు. మొన్నటి వరకు ఒక్కటిగా కలిసున్న ఏఈవోలు రెండు వర్గాలుగా విడిపోవడం ఇప్పుడు వ్యవసాయ శాఖలో హాట్ టాపిక్‌గా మారింది.

సస్పెన్షన్ ఎత్తివేయకపోవడంతో..

రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ వ్యవసాయ విస్తీర్ణ అధికారుల సంఘానికి (టీఏఈవో) చీలికలు వచ్చాయి. సహాయకులను నియమిస్తే తప్పా డిజిటల్ క్రాప్ సర్వే చేయబోమని ఏఈవోలు రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అయితే రైతుబీమా ఆలస్యాన్ని కారణంగా చూపి ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా చాలమంది ఏఈవోలను సస్పెండ్ చేయ గా, జిల్లాలో నలుగురిపై వేటు పడింది. భయంతో టీఏఈవో సంఘ నాయకత్వం ప్రభుత్వానికి తలవంచి సర్వే చేస్తామని చెప్పడంతో ఇటీవల ఏఈవోలంతా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సర్వేను ప్రారంభించారు. ఏఈవోలపై సస్పెన్షన్ ఎత్తివేస్తామని హామీ ఇవ్వడంతో సర్వేను కొనసాగించారు. ఇప్పటివరకు సస్పెన్షన్ ఎత్తివేయకపోవడంతో బాధిత ఏఈవోలంతా యూనియన్ బాధ్యులపై ఒత్తిడి పెంచారు. టీఏఈవో యూనియన్ తీసుకుంటున్న నిర్ణయాలతో అమాయక ఏఈవోలు బలి అవుతున్నారని, ఏఈవోల ఐక్యతను ఇది దెబ్బతీస్తోందని భావించిన మెజారిటీ ఏఈవోలు ఆ సంఘం నుంచి తప్పుకున్నారు. కొత్త సంఘాన్ని ఏర్పాటు చేసుకుని ప్రభుత్వంతో ఏ విధంగా పోరాడాలో కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. సస్పెన్షన్ ఎత్తివేతతో పాటు తమ విన్నపాలను పరిగణలోకి తీసుకుని సర్వే చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం తమపై కఠినంగా వ్యవహరిస్తే సమ్మెకు సైతం వెళ్లాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా ఉంటూనే కొంతమంది ఏఈవోలు సర్వేకు కట్టుబడి పని చేయడం గమనార్హం.

క్లుప్తంగా

నేటి నుంచి జోనల్ స్పోర్ట్స్ మీట్

మోపాల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలల 10వ జోనల్ స్పోర్ట్స్ మీట్ సోమవారం నుంచి కంజర్ గురుకుల పాఠశాల ఆవరణలో నిర్వహిస్తుంచనున్నట్లు ప్రిన్సిపాల్ విజయలలిత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల్ జిల్లాల్లోని 14 బాలికల గురుకుల పాఠశాల నుంచి 1190 మంది విద్యార్థినులు స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొంటారన్నారు. అథ్లెటిక్స్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, హ్యాండ్ బాల్, బాల్ బాడ్మింటన్, టెన్నికాయిట్, చెస్, క్యారం తదితర క్రీడల్లో అండర్–14, 17, 19 విభాగాల్లో నిర్వహిస్తామని తెలిపారు. స్పోర్ట్స్ మీట్ విజయవంతం చేయడం కోసం 12 ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఈ పోటీలు మూడు రోజుల పాటు కొనసాగుతాయని, 14న ముగింపు ఉత్సవాలు ఉంటాయన్నారు.

ముగిసిన యూరాలజిస్ట్ రాష్ట్ర సర్జన్ సదస్సు



నిజామాబాద్‌నాగారం: డిచ్‌పల్లి మండలం బర్దిపూర్ శివారులోని కృష్ణ హోటల్‌లో నిర్వహించిన సొసైటీ ఆఫ్ జెనిటో యూరినరీ సర్జన్స్ రాష్ట్ర సదస్సు ఆదివారం ముగిసింది. సదస్సుకు ఉమ్మడి రాష్ట్రం నుంచి 400మంది యూరాలజిస్టు వైద్యులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా డాక్టర్ వ్యాస్‌నారాయణ హాజరై మాట్లాడారు. డాక్టర్లు ఆధునిక చికిత్సలైన లేజర్, రోబోటిక్, ల్యాప్రోస్కోపిక్, ఎండోస్కోపిక్ చికిత్స పద్ధతుల గురించి వివరించి, చర్చించారు. ఇందులో జిల్లా ప్రతినిధులు యూరాలజిస్టు దయాకర్, రాఘవేందర్, ఆనంద్, శ్రావణ్, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి



దేవాయి(ఫైల్)

బాల్కొండ: మండలంలోని వన్నెల్(బి) గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు మృతి చెందింది. గ్రామానికి చెందిన అర్గుల్ దేవాయి(101) వృద్ధాప్య సమస్యల కారణంగా ఆదివారం మృతి చెందింది. సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

పట్టుబడ్డ పీడీఎస్ బియ్యం 1470.20 క్వింటాళ్లు

వేల్పూర్: మండల కేంద్రంలోని వజ్ర రైసుమిల్లులో పట్టుబడ్డ పీడీఎస్ బియ్యం 1470.20 క్వింటాళ్లుగా తేలిందని ఎస్సై నాగ్‌నాథ్ ఆదివారం రాత్రి తెలిపారు. శుక్రవారం పట్టుబడ్డ పీడీఎస్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం రాత్రి వరకు లెక్కించినట్లు పేర్కొన్నారు.దీంతో అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచిన రైసుమిల్లు వేంపల్లి వంశీకృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఏబీసీ సెంటర్ పరిశీలన



నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సెంటర్‌ను ఆదివారం నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్ పరిశీలించారు. సెంటర్‌లో జరుగుతున్న జంతువుల కుటుంబ నియంత్రణ, వ్యాక్సినేషన్ వంటి పనులను అడిగి తెలుసుకున్నారు. మేనేజర్ జనార్దన్, సెంటర్ ఇన్‌చార్జి సాల్మన్‌రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

లెక్క పక్కానేనా..!

- మూలన పడ్డ కౌంటింగ్ యంత్రాలు
- గత లెక్కల్లో భారీ వ్యత్యాసం
- ఆవేదనలో మత్స్యకారులు



ప్రాజెక్ట్‌లో చేపపిల్లలను వదులుతున్న అధికారులు(ఫైల్)

బాల్కొండ: రాష్ట్ర ప్రభుత్వం నీలి విప్లవంలో భాగంగా మత్స్యకారులకు వంద శాతం సబ్సిడీపై చేపపిల్లలను సరఫరా చేస్తోంది. వాటిని ప్రాజెక్ట్, చెరువుల్లో సంబంధిత అధికారులు వదులుతున్నారు. కానీ వాటి లెక్కలపై మత్స్యకారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో చేపపిల్లల లెక్కల్లో భారీగా తేడాలు వచ్చాయి. దీంతో మూడేళ్ల క్రితం చేప పిల్లల లెక్కింపు కోసం గత ప్రభుత్వం కౌంటింగ్ యంత్రాలను తయారు చేయించింది. దీంతో చేపపిల్లలను యంత్రంలో వేస్తే లెక్క తెలిపోయే విధంగా తయారు చేశారు. కానీ ఏడాది తిరగక ముందే యంత్రాలను మూలన పడేశారు. దీంతో చేపపిల్లల లెక్కపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుత ఏడాది ఎస్సారెస్పీలో 31 లక్షల చేప పిల్లలను వదులుటకు ప్రభుత్వం చేపపిల్లలను సరఫరా చేసింది. గత వారంలో చేపపిల్లలను వదిలే ప్రక్రియను పూర్తి చేశారు. చేపపిల్లలను ఇతర ప్రాంతాల నుంచి ఆక్సిజన్ సాయంతో డ్రమ్ముల్లో తీసుకొచ్చి ప్రాజెక్ట్‌లో వదులుతారు. ముందుగా ఒక డ్రమ్ములో ఒక డబ్బాతో చేప పిల్లలను తీస్తారు. అలా తీసిన ఆ డబ్బాలో చేప పిల్లలను లెక్కిస్తారు. తర్వాత డ్రమ్ములో ఎన్ని డబ్బాలు అయ్యాయో లెక్కిస్తారు. అలా ఒక డ్రమ్ముల్లో ఎన్ని చేప పిల్లలు ఉన్నాయో లెక్కించి, మిగతా డ్రమ్ములను కూడా అదే లెక్కలో లెక్కిస్తారు. కానీ ఆ డ్రమ్ముల్లో అన్నే చేపపిల్లలు ఉంటాయా? డబ్బా డబ్బాకు తేడా వస్తుంది. అలాంటి డ్రమ్ముల్లో లెక్క ఎలా తేలుతుందని ఇదంతా కాంట్రాక్టర్లు సృష్టిస్తున్న నాటకమంటు మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టులో చేప పిల్లలను వదులుతున్నామని అధికారులు నివేదికలు ఇస్తారున్నారే కానీ చేపల వేటలో మాత్రం అవి కనిపించకుండా పోతున్నాయి. పాలకులు స్పందించి చేప పిల్లల లెక్కింపు పక్కాగా జరిగేలా యంత్రాలను తీసుకు రావాలని మత్స్యకారులు కోరుతున్నారు.

సాంకేతిక సమస్యతోనే..

కౌంటింగ్ యంత్రాలలో సాంకేతిక సమస్య ఉండడంతో పక్కన పెట్టాం. ప్రస్తుతం లెక్కిస్తున్న విధానంలో కొంత తక్కువ వచ్చినా లెక్క కరెక్ట్‌గా ఉంటోంది. లెక్కలో తగ్గకుండా ఉండేందుకు అదనంగా రెండు ప్యాకెట్ల చేప పిల్లలను కాంట్రాక్టర్ అందజేస్తున్నారు. – ఆంజనేయులు, ఏడీ, మత్స్యశాఖ

క్రీడలతో బంగారు భవిష్యత్తు



క్రీడాకారులతో మాట్లాడుతున్న సయ్యద్‌ఖైసర్



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- అట్టహాసంగా ప్రారంభమైన ఖైసర్ అకాడమీ టోర్నీ

నిజామాబాద్‌నాగారం: చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తు బంగారుమయంగా ఉంటుందని, క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఖైసర్ తన అకాడమీ ఆధ్వర్యంలో టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని రాజారాం స్టేడియంలో భారత రత్నా మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ మెమోరియల్ అథ్లెటిక్స్ టోర్నమెంట్‌రను ఖైసర్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ అథ్లెటిక్ గోల్డ్‌మెడలిస్టు సయ్యద్‌ఖైసర్ నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. క్రీడాకారులకు ఖైసర్ అండగా ఉండడం చాలా సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోటీలకు 79 పాఠశాల నుంచి 1882మంది విద్యార్థులు హాజరయ్యారు. నిజామాబాద్, హైదరాబాద్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బోధన్, ఆర్మూర్, బాల్కొండ, బాన్సువాడ, కోటగిరి తదితర ప్రాంతాల నుంచి వచ్చారు. క్రీడాకారులకు అథ్లెటిక్స్‌లో రన్నింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, డీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, కాలూరు మాజీ సర్పంచ్ అగ్గు బోజన్న, రాజేందర్, పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.



పరుగుపందెం పోటీలో తలపడుతున్న క్రీడాకారులు



స్పృహ తప్పి పడిపోయిన క్రీడాకారిణి

వర్గీకరణపై తొందరపాటు నిర్ణయం సరికాదని చెప్పా



సమ్మేళనంలో అభివాదం చేస్తున్న చెన్నూరు ఎమ్మెల్యే వివేక్, ప్రతినిధులు

- మాలలను చీల్చడానికి కుట్రలు
- ఐక్యతతో మన సత్తా చాటాలి
- చెన్నూరు ఎమ్మెల్యే వివేక్

నిజామాబాద్ నాగారం: వర్గీకరణపై సుప్రీం తీర్పు వచ్చాక మాలజాతిలో అభద్రత నెలకొందని, తొందరపాటుతో ఎస్సీ వర్గీకరణపై నిర్ణయం తీసుకోవడం సరికాదని సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పినట్లు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. నిజామాబాద్ నగరంలో మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మాలల ఐక్యతను చీల్చడానికి కుట్రలు జరుగుతున్నాయని, మనమందరం ఐక్యంగా ఉంటు నిరసనలు, ఆందోళనలతో మన సత్తా చాటాలని అన్నారు. ఇప్పుడు మాల జాతి మేల్కోకపోతే భవిష్యత్ అగాధంలో పడుతుందన్నారు. సొంత పనులు పక్కన పెట్టాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. అన్ని రాజకీయ పార్టీలకు మన సత్తా అర్థమయ్యేలా పోరాటాలు చేయాలని సూచించారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై కేంద్రం చిన్నచూపు చూస్తోందని అన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఈడీ, ఇన్‌కమ్‌ట్యాక్స్ రైడ్లతో తనను భయపెట్టడానికి ప్రయత్నించారన్నారు. ఉద్యమం నుంచి బయటకు వస్తే కేంద్రంలో మంత్రి పదవి ఇస్తామన్నా దేనికి లొంగలేదన్నారు. ఏసీబీ దాడులు 90శాతం మాల ఉద్యోగులపైనే జరుగుతున్నాని అన్నారు. రాష్ట్ర జనాభాలో మాలలు రెండోస్థానంలో ఉన్నా, 30లక్షల మంది జనాభాను తక్కువ చేసి చూపిస్తున్నారన్నారు. డిసెంబర్ 1న హైదరాబాద్‌లో తలపెట్టిన సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య, అలుక కిషన్, ఎడ్ల నాగరాజు, అమృత్, అంగరి ప్రదీప్, విజయ్, ఎల్లన్న, రాంచందర్, స్వామిదాస్, దేవిదాస్, సర్వయ్య, విజయ్‌కుమార్, జయ్‌పాల్, సుంకరిమోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెన్నూరు ఎమ్మెల్యే వివేక్

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న వివేకానంద పాఠశాల విద్యార్థులు

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని వివేకానంద పాఠశాలలో 1997–98లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి మిత్రులందరూ ఒకే చోట కలవడంతో సంతోషం వ్యక్తం చేశారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రవికాంత్, ఉపాధ్యాయులు శ్రీకాంత్, నారాయణ్ రావు, పరమేశ్వర్, చింతల శ్రీనివాస్, నిశిత, సుమతి, ప్రేమలత, రామరాణి, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. నగరంలోని రాధాకృష్ణ విద్యాలయంలో 1990కు చెందిన ఏడో తరగతి పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. నాటి టీచర్లను సన్మానించారు. కార్యక్రమంలో ప్రవీణ్, రాజు, అజయ్, రజిని, సునీత, జమున తదితరులు పాల్గొన్నారు.



రాధాకృష్ణ పాఠశాలలో..

సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్ల ప్రతిభ

నిజామాబాద్‌నాగారం: బెల్లంపల్లి కేంద్రంగా రెండు రోజులపాటు నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. సింగరేణి తిలక్ స్టేడియంలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్–19 విభాగంలో బాల, బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. పోటీలకు 9 బాలుర, 9 బాలికల జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. బాలుర విభాగంలో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయస్థానంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు, తృతీయ స్థానంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్టు నిలిచాయి. బాలికల విభాగంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఉమ్మడి మెదక్ జట్టు (ద్వితీయ), మహబూబ్‌నగర్ జట్టు (తృతీయ) స్థానాల్లో నిలిచాయి.

సత్తాచాటిన మెదక్, నిజామాబాద్ జిల్లాల జట్లు

సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల జట్లు సత్తాచాటాయి. బాలికల విభాగంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్టు హోరాహోరీగా తలపడి ప్రథమస్థానాన్ని దక్కించుకోగా, అదే జిల్లాకు చెందిన బాలుర జట్టు తృతీయ స్థానంలో నిలిచి సత్తాచాటింది. అనంతరం విజేత జట్లకు నిర్వాహకులు, అధికారులు బహుమతులు అందజేశారు.





విజేత జట్లకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు, అధికారులు

క్రీడా సమాచారం

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో జిల్లా జట్టు విజయం



నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ అండర్–17 ఖోఖో బాలికల పోటీల్లో జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఈ నెల 8 నుంచి 10వరకు ఖమ్మం జిల్లాలో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు జరిగాయి. ఆదివారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో నల్గొండ జట్టుపై జిల్లా బాలికల జట్టు గెలిచి విజేతగా నిలిచి ట్రోఫీని అందుకుంది. జట్టుకు సంతోషిని, కల్పన, అశోక్‌లు కోచ్, మేనేజర్లుగా వ్యవహరించారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు జిల్లా విద్యార్థులు

నిజామాబాద్ రూరల్: జాతీయ స్థాయి యోగా పోటీలకు జిల్లా విద్యార్థులు ఎంపికయ్యారు. అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో నిర్వహించే పోటీల్లో 10–14 ఏళ్ల విభాగంలో తనయ, తన్వి, 18–20 ఏళ్ల విభాగంలో నిర్ణయ, హాసిని, హసిత పాల్గొననున్నట్లు జిల్లా జట్టు కోచ్ రఘువీర్ పేర్కొన్నారు. పోటీలకు ఎంపికై వెళ్తున్న విద్యార్థులను జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యోగా రాంచందర్, టి బాల శేఖర్, సంయుక్త కార్యదర్శి జి సంగీత అభినందనలు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఆదివారం గౌహతికి బయలుదేరారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు సర్వం సిద్ధం

నిజామాబాద్‌నాగారం: ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్–17 హాకీ పోటీలను జిల్లాలో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని ఎస్జీఎఫ్ కార్యదర్శి నాగమణి తెలిపారు. ఆదివారం నగరంలోని మానిక్‌బండార్‌లోని నవ్యభారతిస్కూల్‌లో టోర్నమెంట్ నిర్వహించడానికి ఏర్పాట్లు పరిశీలించారు. ఈ నెల 11 నుంచి 13వరకు టోర్నమెంట్ జరుగుతుందన్నారు. వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, పీఈటీలు స్వప్న, ఇందిరా, అనురాధ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో జిల్లాకు పతకాలు



నిజామాబాద్‌నాగారం: ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో జిల్లాకు పతకాల పంట పండింది. ఈ నెల 8, 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లో అండర్–14, 17 బాలుర విభాగంలో కుస్తీ పోటీలు జరిగాయి. పోటీల్లో క్రీడాకారులు సత్తాచాటారు. క్రీడాకారులు పతకాలు సాధించడంపై ఎస్జీఎఫ్ కార్యదర్శి నాగమణి వారికి అభినందనలు తెలిపారు. జట్టుకు దేవేందర్, సంతోషి, ప్రతిభ కోచ్‌లుగా వ్యవహరించారు.

క్రైం కార్నర్

ఈత కోసం వెళ్లి అనంత లోకాలకు..

నిజాంసాగర్: ఈత కోసం వెళ్లిన గునుకుల్ శివానంద్(17) అనే ఇంటర్ విద్యార్థి నీట మునిగి మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలోని మల్లూరు గ్రామ శివారులోని మంజీరా నది వద్ద జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మహమ్మద్నగర్ మండలంలోని కొమలంచ గ్రామానికి చెందిన గునుకుల్ మొగులవ్వ, పోచయ్య దంపతుల కుమారుడు శివానంద్ బాన్సువాడ పట్టణంలోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం మల్లూరుకు చెందిన ఒకరితో కలిసి గ్రామ శివారులోని మంజీరా నది వద్దకు వచ్చారు. నదిలోని మూల బావిలో స్నానం చేసేందుకు శివానంద్ దిగి నీట మునిగిపోయాడు. ఒడ్డుపై ఉన్న వ్యక్తి భయంతో గ్రామానికి చేరుకొని జరిగిన విషయాన్ని గ్రామస్తులకు తెలిపాడు. గ్రామస్తులు ఘటన స్థలానికి చేరుకొని బావిలో శివానంద్ మృతదేహాన్ని బయటకి తీశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహానికి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



శివానంద్(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

నవీపేట: మండల కేంద్రంలోని కందకుర్తి రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలైనట్లు ఎస్సై వినయ్ తెలిపారు. నవీపేట్ నుంచి సాటాపూర్ వైపు వెళ్తున్న ట్రాలీ ఆటో స్పీడ్ బ్రేకర్ వద్ద మెల్లిగా ఆగింది. ఈ క్రమంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు ఆటోను ఢీకొన్నది. దీంతో కారు డ్రైవర్‌తో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న అయిదుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గోదాంపై పోలీసుల దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని అశోక్‌నగర్ ప్రాంతంలో పీడీఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచిన గోదాంపై శనివారం రాత్రి దాడి చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి ఆదివారం తెలిపారు. అశోక్‌నగర్ ప్రాంతంలోని సుల్తాన్, సుమేర్ నిర్వహిస్తున్న గోదాంపై దాడి చేయగా లారీలో రెండు టన్నులకు పైగా ఉన్న పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బియ్యాన్ని రేషన్‌షాపుల వద్ద తమ ఏజెంట్లను నియమించుకుని కొనుగోలు చేయగా మరికొన్ని ప్రాంతాల్లో గ్రామాల వారిగా బియ్యాన్ని కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు రీసైక్లింగ్ కోసం తరలించినట్లు గుర్తించారు. వీరిపై గతంలో కేసు ఉన్నట్లు తెలిసింది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



లక్ష్మణ్(ఫైల్)

నాగిరెడ్డిపేట: మండలంలోని నాగిరెడ్డిపేట గ్రామానికి చెందిన మంగలి లక్ష్మణ్(23)అనే యువకుడు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్సై మల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంగలి లక్ష్మణ్‌కు గత ఏప్రిల్‌లో సంగారెడ్డి జిల్లా రాయికోడ్ గ్రామానికి చెందిన మౌనికతో వివాహం జరిగింది. దీపావళికి లక్ష్మణ్ గత నెల 27న భార్యతో కలిసి అత్తగారింటికి వెళ్లాడు. 29న తండ్రి చంద్రయ్య లక్ష్మణ్‌కు ఫోన్‌చేసి ఇంటికి చెప్పాడు. అదే రోజు ఇంటికి వచ్చిన లక్ష్మణ్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబీకులు మెరుగుచికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. లక్ష్మణ్ భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గాంధారిలో మరొకరు..

గాంధారి: హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మండల కేంద్రానికి చెందిన సింధె రాజారావు అలియాస్ రాజు(42) ఆదివారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన రాజు ఈ నెల 6న గుడిమెట్ నుంచి గాంధారి వైపు బైక్‌పై వస్తుండగా రోడ్డు పక్కన చెట్టును ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతనికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



రాజు(ఫైల్)

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

తాడ్వాయి: కుటుంబ కలహాలతో ఒకరు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన తాడ్వాయి మండలంలోని చందాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి సాయిలు(43) మద్యానికి బానిసయ్యాడు. చేసిన అప్పులు సైతం పెరగడంతో కుటుంబంలో గొడవలు మొదలయ్యాయి. ఈనెల 4న రాత్రి మద్యం తాగి పంటకు వచ్చిన డబ్బులు ఇవ్వాలంటు భార్యతో గొడవ పడ్డాడు. 5న ఉదయం మరోసారి భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అతని కోసం పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం చందాపూర్ శివారులోని వ్యవసాయ భూమిలో చెట్టుకు ఉరేసుకొని సాయిలు విగతజీవిగా కనిపించాడు. మృతుడి భార్య రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

తల్లి, కూతురు అదృశ్యం

కామారెడ్డి క్రైం: మండలంలోని ఓ గ్రామానికి చెందిన తల్లీ, కుమార్తె అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు ఆదివారం తెలిపారు. కుటుంబ తగాదాల నేపథ్యంలో ఓ వివాహిత తన కుమార్తెతో కలిసి రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఆర్మూర్‌టౌన్: ఆలూర్ మండల కేంద్రంలోని పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ ఆదివారం తెలిపారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని పట్టుకోగా వారి నుంచి రూ. 23,610 నగదు, 4 సెల్‌ఫోన్లు, 3 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

లారీ నుంచి డీజిల్ అపహరణ



భిక్కనూరు: బ్యాటరీ పేలడంతో రోడ్డుపై నిలిచిన లారీ నుంచి డీజిల్‌ను దొంగలు అపహరించుకెళ్లిన ఘటన మండల కేంద్రంలోని టోల్ ప్లాజా సమీపంలో ఆదివారం వేకువ జామున జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ బ్యాటరీ అకస్మాతుగా పేలడంతో ఆదివారం వేకువ జామున టోల్‌ప్లాజా సమీపంలో నిలిచిపోయింది. లారీని రోడ్డు పక్కన నిలిపేలా చేసి డ్రైవర్, క్లీనర్ నిద్ర పోయారు. ఉదయం లేచి చూసే సరికి డీజిల్ ట్యాంక్ మూత ధ్వంసమై ఉండటాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు 300 లీటర్ల డీజిల్ చోరీకి గురైనట్లు డ్రైవర్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

కాపర్, ఆయిల్ చోరీ

నవీపేట: మండలంలోని నాగేపూర్ శివారులోని రెండు ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసినట్లు ఎస్సై వినయ్ ఆదివారం తెలిపారు. రెండు ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్ కాయిల్స్, ఆయిల్‌ను చోరీ చేశారు. లైన్‌మన్ నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

4.2 కిలోల గంజాయి పట్టివేత



గంజాయిని పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు

ఖలీల్‌వాడి: నగరంలోని మాధవనగర్ వద్ద గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కంఠేశ్వర్ బైపాస్ నుంచి మాధవనగర్ వెళ్లే మార్గంలో శనివారం సాయంత్రం బైక్‌పై వెళ్తున్న సర్ఫరాజ్‌ఖాన్‌ను తనిఖీ చేయగా అతడి వద్ద 2.1 కిలోల గంజాయి లభ్యమైందని ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో దిలీప్ ఆదివారం తెలిపారు. సర్ఫరాజ్‌ఖాన్‌ను విచారించగా మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి తీసుకొచ్చి ఇక్కడ అధిక లాభాలకు అమ్ముతున్నట్లు చెప్పారు. అదేమార్గంలో ఆటోలో గంజాయి వస్తుందనే సమాచారం మేరకు తనిఖీ చేయగా ద్వారకానగర్‌కి చెందిన సాజిత్‌అలీ ఆటోను వదిలి పారిపోయాడు. ఆటోలో 2.1 కేజీల గంజాయి లభించింది. ఈ రెండు కేసుల్లో 4.2 కేజీల గంజాయి, ఒక పల్సర్ బైక్, ఒక ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. సర్ఫరాజ్‌ఖాన్‌ను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో నిజామాబాద్ ఎక్సైజ్ ఎస్సై మల్లేశ్, సిబ్బంది షబ్బీర్, ప్రభాకర్, దార్‌సింగ్, రవి, సంగయ్య, సౌమ్య పాల్గొన్నారు.

పోలీస్ వాహనంలో క్షతగాత్రుల తరలింపు



మద్నూర్: లా అండ్ ఆర్డర్‌ను కాపాడడం పోలీసులకు ఎంత బాగా తెలుసో అలాగే ఆపదలో ఉన్న వారిని రక్షించడం కూడా తమ కర్తవ్యమని మద్నూర్ పోలీసులు అంటున్నారు. మండల కేంద్రానికి సమీపంలో ఉన్న మద్నూర్–బిచ్కుంద జాతీయ రహదారిపై ఆదివారం ప్రయాణికులతో వెళ్తున్న ఆటో బోల్తా పడింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఎస్సై విజయ్‌కొండ ప్రమాదాన్ని గమనించి పోలీస్ వాహనాన్ని నిలిపి ప్రమాదంలో గాయపడిన వారిని తన వాహనంలో ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆపదలో ఉన్న వారిని రక్షించిన పోలీసులను స్థానికులు అభినందనలు తెలిపారు.